డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కడప (ఎన్జీఆర్ సర్కిల్), జూన్ 27: డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టరును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు పరిపాలన సాగించేవి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో డీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు ఉన్న పీఐసీ కమిటీలు తమ పదవులకు రాజీనామా చేశాయి. ఈ నేపథ్యంలో డీసీసీ బ్యాంకులకు జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ 405ను జారీ చేసింది. ఆరు నెలల పాటు జాయింట్ కలెక్టరు బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు గురువారం జేసీ గణేశ్‌కుమార్ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27: అహ్మదాబాద్-తిరుచ్చిరాపల్లె-అహ్మదాబాద్, మధురై-వోకా-మధురై మధ్య నడిచే ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్ తెలిపారు. అహ్మదాబాద్ నుంచి తిరుచ్చిరాపల్లెకు వెళ్లే రైలు (09419 / 09420) గడువు సెప్టెంబరు 26 వరకు పొడిగించినట్లు చెప్పారు. అలాగే తిరుచ్చిరాపల్లె నుంచి అహ్మదాబాద్ వెళ్లే ప్రత్యేక రైలు సెప్టెంబరు 29 వరకు పొడిగించారన్నారు. అలాగే వోకా - మధురై మధ్య నడిచే ప్రత్యేక రైలు సెప్టెంబరు 30 వరకు , మధురై నుంచి వోకా మధ్య నడిచే ప్రత్యేక రైలు అక్టోబరు 4 వరకు పొడిగించినట్లు తెలిపారు.

జగన్ పాలనలో

వైసీపీ ఇష్టారాజ్యం

- అక్రమంగా వైసీపీ కార్యాలయ నిర్మాణం
- అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం చేసుకుంటాం
- కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఐదేళ్లపాలనలో నా రాజ్యం నా ఇష్టం అనే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా వైసీపీ కార్యాలయాలను ఇంద్రభవనాల్లా నిర్మించుకున్నారని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కడప నగరం 3వ డివిజన్‌లోని రామాంజనేయ పురంలో నిర్మాణమవుతున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని, అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా రాజారెడ్డివీధిలో పోలీసుశాఖ స్థలంలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా వైసీపీ కార్యాలయం నిర్మిస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జగన్ కేవలం ఆస్తులు పెంచుకోవడంలో భాగంగానే కార్యాలయాల నిర్మాణాలు చేశారన్నారు. ఒక సెంటు పేదలకు ఇచ్చి.. పార్టీ కార్యాలయాలను మాత్రం ఇంద్రభవనంలా అక్రమంగా నిర్మించుకుంటారా అని ప్రశ్నించారు. వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్న స్థలం గతంలో పేదలకు పంపిణీ చేసిందన్నారు. ఇది ముమ్మాటికీ అక్రమ నిర్మాణమే అన్నారు. వైసీపీ కార్పొరేటరు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని అమ్ముకున్నారని, ఆయన వేసిన ప్లాట్లపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

అక్రమ నిర్మాణాలు కూల్చడం ఖాయం


టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో చేపిట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చడం ఖాయమని అన్నారు. జగన్ అండతో ద్వితీయ శ్రేణి నాయకులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, జిమ్ సెంటర్లు ఇలా వారి వ్యాపారాల కోసం ప్రభుత్వస్థలాలు దోచుకున్నారన్నారు. పోలీసు డిపార్ట్‌మెంటు స్థలం కూడా ఆక్రమించిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిని ప్రశ్నిస్తే వైసీపీ నాయకు లు కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై ఏ కోర్టు కూడా సమర్థించదన్నారు. తాత్కాలికంగా ఏమైనా ఉపశమనం లభించవ చ్చున్నారు. దీనిపై టీడీపీ ప్రభుత్వం పోరాటం చేస్తుందని తెలిపారు. అక్రమ నిర్మాణాలు కూల్చడం ఖాయమన్నారు. అలాగే ప్రభుత్వ స్థలాలు స్వాధీనం చేసుకుంటామన్నారు. ఇప్ప టికే పోలీసు స్థలంలో అక్రమ నిర్మాణాలపై డీజీపీకి ఎమ్మెల్యే లేఖ రాశారని అన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ అక్రమ నిర్మాణాలు, భూకబ్జాల విషయం తీసుకెళ్లి చర్యలు చేపడ తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



వైసీపీ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

- కీలక స్టేషన్లకు వచ్చేందుకు తీవ్ర యత్నాలు
- హాట్ సర్కిళ్లకు యమ గిరాకీ
- ప్రొద్దుటూరులో పోస్టింగ్ కోసం భారీ స్థాయిలో పైరవీలు
- 26 మంది సీఐల యత్నం
- ఆదాయం ఉండే స్టేషన్ల కోసం వెంపర్లాట



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పలువురు పోలీసు అధికారులు ఐపీసీ చట్టం బదులు వైసీపీ చట్టాన్ని అమలు చేశారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వైసీపీ నేతలకు కొందరు అధికారులు ఊడిగం చేశారు. పనిలో పనిగా సెటిల్‌మెంట్లు, బెట్టింగ్ ఇతర వాటిల్లో అధికారులు కూడా భారీగా వెనకేసుకున్నారని వినిపించింది. అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు కొందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. కొంతమంది డీఎస్పీ, సీఐలు, ఇతర అధికారులను లూప్‌లైన్‌లో పెట్టారు. ఇప్పుడు జగన్ పాలన పోయి కూటమి ప్రభుత్వం వచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పరిపాలనను గాడిలో పెట్టేందుకు అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేస్తున్నారు. పాలనలో పోలీసు శాఖ చాలా కీలకమైనది. శాంతిభద్రతలు పరిరక్షణతో పాటు గంజాయి మట్కా బెట్టింగ్ నిర్మూలించాలి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసుల బదిలీలు జరగనున్నాయి. అయితే ఇప్పుడు ఆదాయం ఉండే స్టేషన్ల కోసం కొందరు సీఐలు తహతహలాడుతున్నారు. అక్కడ పోస్టింగ్ కోసం సిఫారసులు చేసుకుంటున్నారు. జిల్లాలో పనిచేసిన వారు మళ్లీ ఇక్కడికే వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తూ.. ఆదాయ మార్గాలు వచ్చే స్టేషన్లపై కన్నేసి అక్కడ చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

ప్రొద్దుటూరు కోసం భారీ పైరవీలు

జిల్లా కేంద్రం కడప నగరం అయినప్పటికీ వ్యాపార కేంద్రం మాత్రం ప్రొద్దుటూరు. దీనికి రెండో ముంబైగా పేరుంది. ఇక్కడ బంగారం, వస్త్ర ఇతర వ్యాపారాలకు పెట్టింది పేరు. అయితే ఈ పట్టణానికి ముంబైకి ఉండే రుగ్మతలన్నీ ఉన్నాయంటారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమరవాణా, బంగారం స్మగ్లింగ్.. ఇలా ఒకటేంటి ముంబైకి దీటుగా ఉన్నాయంటారు. అందుకే ఇక్కడ పోస్టింగ్ కోసం పోలీసులు ఆరాటపడుతుంటారు. ముఖ్యంగా ఆదాయ మార్గాలు ఉన్న స్టేషన్‌లో జాయిన్ అయ్యేందుకు భారీ ఎత్తున పైరవీలు చేస్తుంటారు. గత ప్రభుత్వంలో కొందరు పోస్టింగ్‌లకు లక్షలు చెల్లించారనే చర్చ ఉంది. ప్రొద్దుటూరులో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్, ట్రాఫిక్ సర్కిళ్లు ఉన్నాయి. వన్‌టౌన్, టూటౌన్ సర్కిళ్లు వ్యాపార సంస్థలకు అడ్డాగా ఉన్నాయి. వీటి పరిధిలోనే బంగారం, వస్త్రవ్యాపారులు, ప్రధాన బిజినెస్ అంతా ఇక్కడే ఉంది. అందుకే ప్రొద్దుటూరులో పోస్టింగ్ అంటే ఇష్టపడుతుంటారు. కానిస్టేబుల్ మొదలుకుని డీఎస్పీ వరకు ఇక్కడ ఉద్యోగం చేయాలని ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఇక్కడ డీఎస్పీ పోస్టు కోసం 13 మంది సిఫారసు చేసుకున్నారని అంటున్నారు. ఇక సీఐల కోసం అయితే 26 మంది ప్రయత్నాలు చేశారంటే ప్రొద్దుటూరు రేంజ్ ఏంటో అర్థమవుతుంది. ఇక్కడ జీరో బిజినెస్ జరగడం, బెట్టింగ్, ఇసుక ఇవన్నీ ఉండడంతో ఆదాయ సెంటరుగా చెబుతారు. అందుకే ఇక్కడికి రావడానికి బాగా ప్రయత్నాలు చేస్తారు.

కడపలో..

కడపలో రిమ్స్, టూటౌన్ సర్కిళ్ల కోసం పలువురు పోటీ పడుతున్నారు. వైసీపీ హయాంలో కడపలో కొందరు సీఐలే పోలీస్‌స్టేషన్లను సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చారు. లక్షలు సంపాదించారనే ఆరోపణలున్నాయి. అప్పుడు అధికారులు శాంతిభద్రతలు గాలికి వదిలేయడంతో గంజాయి, రౌడీగ్యాంగ్‌లు విచ్చలవిడిగా చెలరేగాయి. పోస్టింగ్‌ల కోసం కూడా అప్పట్లో భారీ ఎత్తున ముడుపులు ఇచ్చారంటారు. ఒక సారు కూడా పెద్దఎత్తున ల కారాలు ముట్టచెప్పి పోస్టింగ్ తెచ్చుకున్నారని చెబుతారు. ఇక్కడ గతంలో చిన్నచౌకు, తాలూకా, రిమ్స్, టూటౌన్ సర్కిళ్లలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు భారీగా సాగేవి. ఇక్కడ పోస్టింగ్ కోసం ఈసారి భారీగానే ప్రయత్నాలు చేస్తున్నారు.

మిగిలిన చోట్ల

ఎర్రగుంట్ల సర్కిల్‌లో కూడా మంచి ఆదాయ మార్గం ఉందని చెబుతారు. ఇక్కడ ఫ్యాక్టరీలు ఉండడంతో ఇది మంచి రాబడిగా పేరుంది. వేంపల్లె సర్కిల్‌లో కూడా డిమాండ్ ఉంది. ఇక్కడ ఇసుక ఉండడంతో ఇది మంచి ఆదాయ స్టేషన్‌గా చెబుతారు. ఇక పులివెందులలో అయితే మొన్నటిదాకా వైసీపీ చేతుల్లో ఉండేది. ఇక్కడ ఏకంగా మట్కా కంపెనీలే ఏర్పాటు చేయడంతో పాటు జూదానికి అడ్డాగా ఉండేది. ఇక్కడకు కూడా వచ్చేందుకు తహతహలాడుతున్నారు. పులివెందుల వచ్చేందుకు సిఫారసులు మొదలయ్యాయి. ఇక బద్వేలు, పోరుమామిళ్ల సర్కిల్‌లో ల్యాండ్ సెటిల్‌మెంట్లు భూకబ్జాలు ఎక్కువగా ఉండడంతో ఇది ఆదాయవనరుగా చెబుతారు. జమ్మలమడుగు కూడా ఇసుక రవాణాకు పేరు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు ఉబలాటపడుతున్నారు. గతంలో ఎంతైనా డబ్బులు ఇచ్చి పోస్టింగ్ తెచ్చుకుని.. ఆ డబ్బులు రాబట్టుకునేందుకు జనాన్ని పీడించడమే పనిగా పెట్టుకునేవారు. కొత్తగా కొలువుదీరిన కూటమి నేతలు గంజాయి, భూకబ్జాలు, రౌడీయిజం అణచివేస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు పోస్టింగ్‌కు డబ్బుల వ్యవహారం ఎక్కడా డబ్బుల వ్యవహారం బయటకు రాలేదు. సమర్థులను తెచ్చుకునేందుకు ఎన్డీయే కూటమి ప్రజాప్రతినిధులు ఆచితూచి వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేశ్ కుమార్



పింఛన్ల పంపిణీ పక్కాగా నిర్వహించండి

- సచివాలయ సిబ్బందితో 1 తేదీన రూ.7 వేలు పంపిణీ : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూన్ 27: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథక పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులతో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యకార్యదర్శి మాట్లాడుతూ పెంచిన పెన్షన్లను వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బందితో ఇంటివద్దే అందజేయాలన్నారు. జులై 2 వతేది లోపు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఎంప్లాయి లాగిన్‌లో 50 మందితో క్లస్టర్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సిబ్బంది తక్కువగా ఉన్నచోట్ల ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలన్నారు. వీళ్లకు మండల ప్రజా పరిషత్ లాగిన్‌లు ఉంటాయన్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్ అమౌంట్‌ను రూ.4 వేలకు పెంచామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు నెలకు రూ.1000 చొప్పున కలిపి రూ.7 వేలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామవార్డు సచివాలయాల పరిధిలో పెన్షనర్ల క్లస్టర్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెన్షన్ మొత్తాన్ని శనివారం పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ, మరో సెక్రటరీ సమక్షంలో విత్ డ్రా చేసుకోవాలన్నారు. జులై1 వతే దీన తెల్లవారు జాము నుంచే పెన్షనర్లకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ



సునంద (3వ ర్యాంకు)



స్వర్ణ (5వ ర్యాంకు)

బద్వేలు రూరల్/కొండాపురం, జూన్ 27: ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో జిల్లావాసులు ప్రతిభ చూపారు. బద్వేలు మండలం జోగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కమతం స్వర్ణ పర్‌ఫార్మింగ్ ఆర్ట్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించారు. ఈ విద్యార్థిని తిరుపతిలో బీఏ మ్యూజిక్ (కర్ణాటక సంగీతం) పూర్తి చేశారు. పీజీలో కూడా కర్ణాటక సంగీతం పూర్తి చేస్తానని అనంతరం పీహెచ్‌డీ చేయడం లేదా సంగీత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తానని అన్నారు. కాగా.. బీఎఫ్ఏ విభాగంలో మైదుకూరు మండలం నానుబాలపల్లెకు చెందిన ఎద్దుల సునంద రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో కొండాపురం మండలం కోడూరు వాసి కాళహస్తి నిఖిల పదవ ర్యాంకు సాధించారు.

రూ.2 కోట్ల జడ్పీ స్థలంలో..

వైసీపీ నేత హోటల్

- సదరు నేతపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన జడ్పీ అధికారులు
- హైకోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకున్న సదరు నేత
- నేడు హైకోర్టులో జడ్పీ కౌంటర్ పిటీషన్

కడప(రూరల్), జూన్ 27: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అక్రమార్కుల భరతం పడుతున్నారు. ప్రభుత్వ భూములను, స్థలాలను అడ్డదారుల్లో దక్కించుకున్న వైసీపీ నేతలకు దిమ్మతిరిగి బొమ్మ కనిపించేలా చేస్తున్నారు. ఇప్పటికే కడప నగంలో వందల కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాల్లో పాగా వేసిన వైసీపీ నేతల చెరనుంచి ఆ స్థలాలను రక్షించే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కడప నగరం నడిబోడ్డులో రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలంలో అక్రమంగా హోటల్ నిర్మించిన కార్పొరేటర్ భర్త, వైసీపీ నేత తుంగా రవీంద్రనాథరెడ్డిపై జడ్పీ అధికారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ పరిణామంతో వైసీపీ నేత అవాక్కయ్యారు. నిన్నటి వరకు తాము చెప్పినట్టు జీ హుజూర్ అన్న అధికారులు ప్రభుత్వం మారిపోగానే కేసులు పెట్టడంతో గాబరాపడ్డారు. దీంతో ఇప్పటికీ వైసీపీతో అంటకాగుతున్న కొందరు అధికారుల సలహాతో ఆ నేత హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెలాఖరువరకు హోటల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. సదరు విషయాన్ని జడ్పీ అధికారులు ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌కు తెలియజేశారు. దీంతో వైసీపీ నేత తెచ్చుకున్న స్టే ఆర్డర్‌ను డిస్మిస్ చేయించేందుకు శుక్రవారం హైకోర్టులో కౌంటర్ పిటిషన్ వేయనున్నారు.

వైసీపీతో అంటకాగిన అధికారులే పాత్రధారులు

వైసీపీ నేత తుంగా రవీంద్రనాథరెడ్డి రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలంలో హోటల్‌ను ఏర్పాటుచేయడం వెనుక ఆది నుంచి వైసీపీతో అంటకాగిన ఇద్దరు అధికారులే కీలకంగా వ్యహరించి తమకు తలనొప్పి తెచ్చిపెట్టారని పై అధికారులు మండిపడుతున్నారు. ఆ ఇద్దరు ఒక పక్క యూనియన్ లీడర్లుగా ఉంటూనే మరోపక్క జడ్పీ చైర్మన్‌కు సీసీలుగా కొనసాగుతూ వారి మాటకు ఎదురులేకుండా చేసుకున్నారు. రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా హోటల్ నిర్మిస్తుంటే ఆ దరిదాపుల్లోకి అప్పట్లో ఏ అధికారి కూడా వెళ్లకుండా పావులు కదిపినట్లు సమాచారం.



జడ్పీ స్థలంలో అనుమతులు లేకుండా వైసీపీ నేత ఏర్పాటు చేసిన హోటల్

నాడు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు

రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలంలో వైసీపీ నేత తుంగా రవీంద్రనాథరెడ్డి అక్రమంగా హోటల్ నిర్మిస్తున్నారని గత ప్రభుత్వ పాలనలో రవీంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ కలెక్టర్‌కు, విజిలెన్స్ అధికారులకు, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ వైసీపీతో అంటకాగి జడ్పీ చైర్మన్ వద్ద సీసీలుగా ఉన్న సదరు ఇద్దరు అధికారులు ఫిర్యాదులను బుట్టదాఖలు చేయించినట్లు సమాచారం. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో.. జడ్పీ స్థలంలో అక్రమంగా ఏర్పాటుచేసి నడుపుతున్న హోటల్‌పై చర్యలకు ఉపక్రమించింది. హోటల్‌ను ఖాళీ చేయించే పనిలో అధికారులు తలమునకలయ్యారు. హోటల్ అక్రమ నిర్మాణంపై గతంలో వచ్చిన ఫిర్యాదులను వెలికితీస్తున్నారు.

ఎమ్మెల్యేల ప్రాపకం కోసం..

వైసీపీ ప్రభుత్వ పాలనలో జడ్పీలో చక్రం తిప్పి టీడీపీ సానుభూతి అధికారులను ఇబ్బంది పెట్టిన ఆ ఇద్దరు అధికారులు.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ బాగోతం బయటపడకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తమకున్న బంధుత్వాలను అడ్డం పెట్టుకొని టీడీపీ ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుందుకు వెంపర్లాడుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం..

జడ్పీ క్వార్టర్స్ స్థలంలోని రెండు సెంట్లలో అనుమతులు లేకుండా హోటల్‌ను నడుపుతున్న నిర్వాహకునిపై చర్యలు తీసుకోవడంతో పాటు హోటల్‌ను తొలగింపచేయాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. సదరు ఫిర్యాదుపై రవీంద్రనాథరెడ్డి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. స్టే ఆర్డర్‌ను డిస్మిస్ చేయాలని నేడు హైకోర్టులో కౌంటర్ పిటీషన్ వేస్తున్నాం.

- సుధాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో

ఏసీసీ పరిశ్రమ నిర్మాణం జరిగేనా..?

● రెండు దశాబ్దాలకు పైగా ఎదురు చూపులు

● కొత్త ప్రభుత్వంపై బాధిత రైతుల ఆశలు

వాళ్లంతా ఒకప్పుడు తమ పంటపొలాలను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరి భూముల్లో సిమెంటు పరిశ్రమ నిర్మించేందుకు ఓ ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఆ రైతులు కూడా తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో భూములను సిమెంటు పరిశ్రమకు ఇచ్చేందుకు అంగీకరించారు. అప్పట్లో సిమెంటు పరిశ్రమ యాజమాన్యం ఒక్కో ఎకరా రూ.50వేలతో కొనుగోలు చేసింది. ఆ తర్వాత పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా.. భూములను మాత్రం రైతుల నుంచి కొను గోలు చేస్తూ వచ్చింది. ఇప్పటికి దాదాపు 28 ఏళ్లు దాటినా పరిశ్రమ ఏర్పాటు కాలేదు. భూములిచ్చిన వారికి ఉద్యోగాలు రాలేదు. పంట పొలాలు మాత్రం బీడువారాయి. ఇక ఎప్పటికి సిమెంటు పరిశ్రమ నెలకొల్పుతారో తెలియని పరిస్థితి. ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పరిశ్రమ నిర్మిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మైలవరం, జూన్ 27: మండల పరిధిలోని గొల్లపల్లె, వద్దిరాల పరిసర ప్రాంతాల్లో నాణ్యత గల సిమెంటురాయి ఉన్నట్లు తేలడంతో 1996 సంవత్సరంలో అసోసియేట్ సిమెంటు పరిశ్రమ (ఏసీసీ) నిర్మాణానికి యాజమాన్యం ముందుకు వచ్చింది. ఇందుకోసం వద్దిరాల, గొల్లపల్లె, జీ.ఉప్పలపాడు, చిన్నవెంతుర్ల, బెస్త వేముల, బి.జంగాపల్లె, రేగడిపల్లె, కల్లుట్ల, తదితర గ్రామాలలోని రైతుల నుంచి వేల ఎకరాలను కొనుగోలు చేశారు. 1996 సంవత్సరంలో ఎకరా రూ.50వేలతో 800 ఎకరాలు, 2006-07 సంవత్సరంలో రూ.1.25వేలతో 1200 ఎకరాలు, 2008-09 సంవత్సరంలో రూ.4లక్షలతో 700ల ఎకరాలకు పైగా భూములను.. మొత్తం 2,700 ఎకరాలకు పైగా కొనుగోలు చేసింది.

పరిశ్రమ ఏర్పాటు కాకపోవడంతో....

రైతుల నుంచి భూములు కొనుగోలు చేసినా సిమెంటు పరిశ్రమ మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో పంట పొలాలన్నీ బీడుగా మారాయి. వీటిల్లో కంపచెట్లు ఏపుగా పెరిగి అడవి పందులకు నివాస స్థలాలుగా మారి సమీప పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో 2010 సంవత్సరంలో ఏసీసీ భూ బాధితుల సంఘం ఏర్పాటైంది. పరిశ్రమ నిర్మించేంత వరకు బీడు వారిన తమ పంట పొలాలను తామే సాగు చేసుకుంటామంటూ 2010 జూన్‌లో పెద్దఎత్తున ఉద్యమం చేశారు. ఇన్నాళ్లు పరిశ్రమ ఏర్పాటును నానబెడుతూ వచ్చిన ఏసీసీ యాజమాన్యం 2016 సెప్టెంబరు 9వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ఏర్పాటు చేసింది. అయితే రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. చివరకు అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 16వ తేదీ గొల్లపల్లె సమీపంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను పరిష్కించాలని పట్టుబట్టారు.


ఏసీసీ పరిశ్రమ కోసం రైతులు ఇచ్చిన భూములు

రైతులు డిమాండ్లు ఇలా...

ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో రైతులు తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎకరా యాభైవేలు, లక్షా ఇరవైఐదు వేల రూపాయలతో భూములను విక్రయించిన రైతులకు అదనపు పరిహారం చెల్లించాలన్నారు. విద్యార్హతతో నిమిత్తం లేకుండా భూములు కోల్పోయిన రైతులకు ఇంటికి ఒక ఉద్యోగం, శాశ్వత ఉపాధి కల్పించడం, ప్యాక్టరీ నిర్మాణ పనుల్లో భూ నిర్వాసితులకు ప్రాధాన్యత కల్పించడం, పరిశ్రమలో బ్లాస్టింగ్ జరుగుతున్న పుడు సమీప గ్రామాల ఇళ్లకు ప్రమాదం సంభవిస్తే అప్పటి ధరల ప్రకారం ఆ ఇంటికి కొనడం లేదా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేస్తామని చెప్పారు. దాదాపు ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం జరగలేదు. అప్పటి వైసీపీ నాయకులు, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 28 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఏసీసీ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణానికి ముందుకు రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలల్లో ఏ ఒక్క రోజు ఏసీసీ పరిశ్రమ గురించి నోరెత్తకుండా ఏసీసీ భూ బాధిత రైతులకు అన్యాయం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ యువనాయకులు భూపేశ్ రెడ్డిలు గ్రామాల్లో ప్రచార సమయాల్లో ఏసీసీ పరిశ్రమ నిర్మించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో భూ బాధిత రైతులు న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

పరిశ్రమ నిర్మాణానికి కృషి చేయాలి



రెండు దశాబ్దాలకు పైగా పరిశ్రమ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఏసీసీ యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. 2016 లో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించి.. త్వరలో పరిశ్రమ నిర్మిస్తామని ఏసీసీ యాజమాన్యం, పెద్దలు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా పరిశ్రమ నిర్మాణం జరిగేలా చూడాలి.

- మహమ్మద్, రైతు చిన్నవెంతుర్ల గ్రామం

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం..



నేను నాకున్న 8 ఎకరాల పొలాన్ని ఏసీసీ పరిశ్రమకు అమ్మాను. ఏసీసీ యాజమాన్యం 28 సంవత్సరాలుగా పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. నాలాగే చుట్టూ పక్కల గ్రామాల రైతులు చాలామంది పరిశ్రమ నిర్మిస్తారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఎదురు చూస్తున్నారు.కొత్త ప్రభుత్వమైన ఏసీసీ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తుందని ఆశిస్తున్నాం.

- గంగరాజు. రైతు వద్దిరాల గ్రామం

ప్రశాంతంగా ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27: ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 24 నుంచి 27 వరకు ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమేటిక్స్ పొలిటికల్ సైన్స్, సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లతో పాటు పలు యూనివర్శిటీల ప్రొఫెసర్స్ హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరి రోజు సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ లలిత, అసిస్టెంటు ప్రొఫెసరు లాజర్, ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసరు విశ్వనాధ రెడ్డి, మైసూరు యూనివర్శిటీ ప్రొఫెసర్ సంపత్‌కుమార్‌లు హాజరయ్యారు.

విజయవాడ నుంచి బెంగళూరుకు రైలు నడపాలి

టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 27: ఏపీ రాజధాని విజయవాడ నుంచి నంద్యాల మీదుగా ప్రొద్దుటూరు గుండా బెంగళూరుకు ప్రత్యేక రైలు నడపాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గతంలో కడప నుంచి బెంగుళూరుకు రైలు మార్గం మంజూరు చేయించి దాదాపు 20 కిలో మీటర్లు పనులు చేపట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. మళ్లీ ఈ రైలు మార్గం కడప నుంచి పూర్తి చేయాలంటే మూడు వేల కోట్ల వ్యయం అవుతుం దన్నా రు. అందువల్లే విజయవాడ నుంచి బెంగుళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా కేంద్ర మంత్రులను కలుస్తానన్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు విజయవాడ నుంచి ధర్మవరం వరకు నడుపుతున్న రైలును బెంగుళూరు వరకు పొడిగిస్తే చాలన్నారు.

ఉరి వేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


అనూష మృతదేహం

బి.కోడూరు, జూన్ 27: పోరుమామిళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని అనూష (18) ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. వివరాలిలా.. మండల పరిధిలోని రాజుపాలెం (హెచ్ డబ్ల్యు) గ్రామానికి చెందిన మున్నెల్లి శంకరయ్య, చెన్నమ్మ దంపతుల రెండో కూతురు అనూష పోరుమామిళ్లలో డిగ్రీ సెకండియర్ చదువుతోంది. ఇటీవల కాలేజీకి సెలవులు రావడంతో మృతురాలి పెద్దమ్మ మైదు కూరు మండలం వనిపెంట గ్రామ కాలనీలో నివాసం ఉండగా, ఆమె దగ్గరికి వెళ్లింది. అదే కాలనీలోని సందీప్ అనే అబ్బాయితో పరిచయం ఏర్పడి.. చనువుగా ఉండేది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయారు. ఈవిషయమై మృతురాలి తల్లిదండ్రులు ఈనెల 15న బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జయరాములు తన సిబ్బందిని పంపించి ఇరువురిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి.. అనూషను వారి తల్లిదండ్రులతో పంపించారు. అప్పటి నుంచి అనూష వారి తల్లిదండ్రుల వద్దనే ఉంది. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు కానీ గురువారం ఇంటిలో ఎవరూ లేనిది చూసి 10గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్‌ఐ జయరాములు కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరు మామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నీటి గుంతలో పడి విద్యార్థి మృతి


జస్వంత్‌నాయక్ మృతదేహం

సుండుపల్లె, జూన్ 27: మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛాకు చెందిన వెటర్నరీ డాక్టర్ మూనేనాయక్ కుమారుడు జస్వంత్‌నాయక్ (15) పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఇంట్లో స్నానానికి నీళ్లు లేవని ప్రాజెక్టు దిగువ భాగంలోని పింఛా నది ఒడ్డున స్నానానికి వెళ్లి కాలుజారి నీటి గుంతలో పడిపోయారు. ఎవరు చూడకపోవడంతో ఊరంతా వెతికి గురువారం తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు నది సమీపంలో వెతుకుతుండగా మృతదేహం లభించింది. మృతుడు జస్వంత్‌నాయక్ రాజంపేట నవోదయ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలియజేశారు. విద్యార్థి కుటుంబీకులు, బంధుమిత్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



జమ్మలమడుగు, జూన్ 27: మండలంలోని ముద్దనూరు రోడ్డు చిటిమిటి చింతల (పాటి) గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శేగారి మార్క్ (49) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ముద్దనూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన శేగారి మార్క్ జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో బంధువుల పెళ్లికి స్కూటర్‌లో బయల్దేరాడు. చిటిమిటి చింతల గ్రామ సమీపాన రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి ఉండగా.. ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్ పడడంతో ప్రమాదవశాత్తు స్కూటరిస్టు ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో మార్క్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాత్రి 11 గంటల సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు కార్లు దగ్ధం

● *రూ.20 లక్షలు ఆస్తి నష్టం*



రాయచోటిటౌన్, జనవరి 27: స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలకు సమీపం లో గల అపార్ట్‌మెంట్ వద్ద షార్ట్ సర్క్యూ ట్ కారణంగా రెండు కార్లు మంటలు చెలరేగి దగ్ధం అయ్యాయి. సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న చిత్తూరుకు చెందిన లోకేశ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఇలియాస్ తమ కార్లను పార్కింగ్ చేశారు. లోకేశ్‌రెడ్డికి సంబంధించిన కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న వారు భయభ్రాంతులకు గురై ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే లోకేశ్‌రెడ్డికి సంబంధించిన రూ.10లక్షల విలువ చేసే కారు పూర్తిగా కాలిపోవడంతో పాటు పక్కనే ఉన్న ఇలియాస్ కారు సగం పైగా కాలడంతో రూ.10 లక్షలకుపైగా నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

చికెన్ సెంటరులో అగ్ని ప్రమాదం

కడప (క్రైం), జూన్ 27 : కడప నగరం అప్సర సర్కిల్ సమీపంలోని రెడ్డి చికెన్ సెంటరులో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చికెన్ సెంటరు పై గదిలో పాత సామగ్రి ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి పైన ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయి. కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దాదాపు రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

యువకుడి హత్యకేసులో నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు, జూన్ 27: ప్రొద్దుటూరు వైఎంఆర్‌కాలనీలో సోమవారం తెల్లవారుజామున వెంకట మహేశ్వరరెడ్డి అనే యువకుడిని ముక్కలుగా నరికి చంపి శవాన్ని మాయం చేసిన సంచలన హత్య కేసును ఎట్టకేలకు రెండు రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. మృతుడి తల్లి ద్వార్శల సుబ్బరత్నమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసులోని నిందితుడు భూమిరెడ్డి రామచంద్రా రెడ్డిని గురువారం అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరు పెట్టి రిమాండుకు తరలించారు. ఈసందర్భంగా త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐలు వెంకటరమణ, రమణారెడ్డి, కరీం, శ్రీకాంత్‌లతో కలిసి డీఎస్పీ మురళీధర్ వివరాలు వెల్లడించారు. వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయం వీధిలో భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వార్శల సుబ్బరత్నమ్మ, ఆమె కుమారుడు మహేశ్వరరెడ్డి కలిసి కొన్నేళ్లుగా కలిసి జీవనం సాగిస్తున్నారు. సుబ్బరత్నమ్మకు 30 ఏళ్ల క్రితం శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తితో వివాహమైంది. వారిద్దరికి మహేశ్వర్‌రెడ్డి అనే కుమారుడు వున్నాడు. కొన్నేళ్లకు భార్యాభర్తలకు మధ్య విబేధాలు రావడంతో విడిపోయారు. దీంతో గత 20 ఏళ్లుగా సుబ్బరత్నమ్మ రామచంద్రారెడ్డితో కలిసి ఉంటోంది. రామచంద్రారెడ్డి సుబ్బరత్నమ్మ దగ్గర రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడని.. ఆ విషయంలో సుబ్బరత్నమ్మ కుమారుడు హహేశ్వరరెడ్డి రామచంద్రారెడ్డితో తరుచూ గొడవ పడేవాడన్నారు. ఇదే సందర్భంలో మహేశ్వరరెడ్డికి ఒక స్త్రీతో వివాహేతర సంబంధం వుండేది. ఆమెతో రామచంద్రారెడ్డి చనువుగా ఉండటంపై మహేశ్వరరెడ్డి రామచంద్రారెడ్డిని గట్టిగా ప్రశ్నించేవాడు. దీన్ని జీర్ణించుకోలేని రామచంద్రారెడ్డి మహేశ్వరరెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 23న రాత్రి మహేశ్వరరెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా రామచంద్రారెడ్డి ఇనుప పైపుతో తలపై బలంగా కొట్టి చంపాడు. శవాన్ని కనపడకుండా మాయం చేయడం కోసం గొడ్డలితో ముక్కలుగా నరికి లడ్డూలు తయారు చేసే సంచుల్లో శరీర భాగాలను వేసుకుని స్కూటీపై తీసుకెళ్లి జమ్మలమడుగు రోడ్డులోని రాయల్‌కౌంటి ఏరియాలో ముళ్లపొదల్లో వేశాడు. మహేశ్వరరెడ్డి తల్లి సుబ్బరత్నమ్మ అనారోగ్యం కారణంగా రాత్రి మందులు వేసుకొని నిద్రపోవడం వలన ఆమెకు జరిగిందేది తెలియలేదన్నారు. తెల్లవారిన తర్వాత ఇంట్లో రక్తపు మడుగులు వుండటం.. అంతకు ముందే రామచంద్రారెడ్డి స్కూటీలో ఏవో మూటలు తీసుకెళ్లడంతో ఆమెకు అనుమానం వచ్చింది. తన కుమారుడికి ఏమో అయ్యిందని భావించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామచంద్రారెడ్డి తన కుమారుడిని ఏమైనా చేసి వుంటాడని అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదును అందుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి.. పలు బృందాలుగా విడిపోయి మహేశ్వరరెడ్డి శవం కోసం గాలింపు చేపట్టారు. మరోవైపు నిందితుడు రామచంద్రారెడ్డి కోసం అన్వేషించారు. 24వ తేది సాయంత్రం జమ్మలమడుగు రోడ్డులోని రాయల్ కౌంటీ పరిసరాల్లోని ముళ్లపొదల్లో మృతి చెందిన మహేశ్వరరెడ్డి శరీరభాగాలు గల మూటలను గుర్తించారు. తల్లి సుబ్బరత్నమ్మ మృతుడిని గుర్తించాక పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మహేశ్వరరెడ్డి శరీర భాగాలను ఖననం చేశారు. ఈ నేపధ్యంలో పోలీసులు గురువారం చెన్నూరు మండలం కొండపేట వద్ద తన బంధువుల ఇంట్లో తలదాచుకున్న ముద్దాయి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకుని హత్యకు దారితీసిన పరిస్థితులను విచారించారు. ఈ కేసులో సాక్ష్యాలను సమగ్రంగా సేకరించి నిందితుడికి శిక్షపడేలా కేసును పటిష్టంగా పెట్టామన్నారు. మీడియా ముందు ప్రవేశ పెట్టి రిమాండుకు తరలించారు. ఈ సంచలన హత్యకేసును సకాలంలో ఛేదించి నిందితున్ని పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అక్రమ కట్టడాల తొలగింపు చర్యలు వేగవంతం చేయండి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

ప్రొద్దుటూరు, జూన్ 27: రామేశ్వరం గ్రామ పొలంలోని ఫారెస్టు భూముల్లో అక్రమ నిర్మాణాను తొలగించాలని ఏప్రిల్‌లోనే లోకాయుక్త ఆదేశాలు ఇచ్చిందని... ఫారెస్టు అధికారులు త్వరిగతిన నోటీసులు జారీ చేసి వెంటనే తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని ఆర్‌డీవో శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్టు, విద్యుత్, పోలీసు, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రామేశ్వరం పొలంలోని సర్వే నెంబరు 558లో మొత్తం ఫారెస్టు భూమి 168.67 ఎకరాలు ఉండగా.. 16.23 ఎకరాలలో అక్రమంగా నిర్మాణాలు వెలిశాయన్నారు 16.23 ఎకరాల్లో 219 అక్రమ కట్టడాలు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారా అని సబ్ డివిజన్ ఫారెస్టు అధికారి దివాకర్‌ను ప్రశ్నించారు. ఇప్పటివరకు 60 మందికి పైగా నోటీసులు ఇచ్చామని.. మరికొందరు నోటీసులు తీసుకోవడం లేదని తెలిపారు. నోటీసులు తీసుకోకుంటే ఇంటి గోడలకు అంటించి ఫొటో తీసుకురావాలన్నారు. సోమవారం నాటికి నోటీసులు పూర్తిగా అందజేయాలన్నారు. అవసరమైతే రెవెన్యూ, పోలీసు, పంచాయితీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరా బంద్ చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. లేదంటే మీరు ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు పన్నులు వేశారా.. ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చారా అని పరిశీలించాలన్నారు. అలా ఇచ్చిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో తహసీల్దారు విద్యాసాగర్, డీఎస్పీ మురళీధర్, సీఐలు రమణారెడ్డి, శ్రీకాంత్, వెంకటరమణ, కరీం, ఫారెస్టు సబ్‌డివిజన్ ఆఫీసర్ దివాకర్, ఎఫ్ఆర్‌వో హేమాంజలి, సర్వేయర్లు వెంకటలక్ష్మి, సురేంద్ర రాజేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



లింగాల, జూన్ 27: మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన హరినాథ్ బైకులో వెళ్తుండగా ఇప్పట్ల క్రాసింగ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొందన్నారు. దీంతో హరినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అయితే హరినాథ్ కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



తనకల్లు, జూన్ 27: శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతపల్లి పంచాయతీ కొండకిందపల్లి (రత్నగిరి) గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు రమణ(40) గురువారం మృతి చెందారు. ఆయన స్వస్థలం అన్నమయ్య జిల్లా వడ్డివాండ్లపల్లి. అన్నమయ్య జిల్లాతోపాటు శ్రీసత్యసాయి జిల్లాలోని కొండకిందపల్లిలో ఆయనకు పొలాలు ఉన్నాయి. కొండకింద పల్లిలో టమోటా సాగు చేశాడు. పంటకు నీరు పడుతుండగా మోటారు ఆగిపోయింది. స్టార్టర్‌లో ఫ్యూజు పోయిందని తెలుసుకుని.. మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ పీజీసెట్ ఫలితాల్లో నిఖిలకు 10వ ర్యాంక్



కొండాపురం, జూన్ 27: గురువారం విడుదలైన ఏపీ పీజీసెట్ ఫలితాల్లో మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాళహస్తి నిఖిల 10వ ర్యాంకు సాధించింది. ఈమె పీజీసెట్‌లో పొలిటికల్‌సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. 10వ తరగతి వరకు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదివింది. తమ గ్రామ విద్యార్థి స్టేట్‌ర్యాంక్ సాధించడంపట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), జూన్ 27: కడప నగరం నబీకోటలో ఓ మైనర్ బాలిక ఆత్మహత్య కేసుకు సంబంధించి ముగ్గురిని తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. నబీకోటకు చెందిన దివ్య(17) అదే ప్రాంతానికి చెందిన మాధవ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక బాబు జన్మించాడు. గత కొంత కాలంగా అత్త వెంకటసుబ్బమ్మ వేధిస్తుండటంతో ఇటీవల ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. ఈ మేరకు దివ్య అత్తతో పాటు మరో ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డయేరియా నియంత్రణకు చర్యలు

● డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 27: డయేరియా నియంత్రణకు వైద్య సిబ్బంది పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశించారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాయంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి జూన్ 30 వరకు స్టాప్ డయేరియాపై వైద్యసిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి గ్రామం, వార్డులలో డయేరియా రాకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డయేరియా కలుషిత ఆహారం, తాగేనీరు కలుషితం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధిసోకితే నీళ్ల విరోచనాలతో నీరసిస్తారన్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా 5 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేయాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల్లో నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ సీజన్‌లో తాగునీటిని కాచి చల్నార్చి తీసుకోవాలని, పరిసరాలతో పాటు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమహేశ్వరకుమా ర్, డాక్టర్ రవిబాబు, ఎస్ఓ రమేష్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



ఆందోళనలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కడప (నాగరాజుపేట), జూన్ 27: ఎన్నికల హామీల్లో భాగంగా పెట్టుబడి సాయం కింద రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగు సాయం రైతుకు 20వేలు అందించడంతో పాటు పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు రూ.3లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాల్వలు, మేజరు, మైనర్ కాల్వలతో పాటు డెల్టా ప్రాంతాల్లోని మురుగునీటి కాల్వ మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతాంగానికి చెల్లించాల్సిన నిధుల బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. గత రబీ సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించాలన్నారు. వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, నాగలి తదితర పనిముట్ల కొనుగోలుపై 50శాతం సబ్సిడీ అందించాలన్నారు. ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీపై డీజలు సరఫరా చేయాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టి కల్తీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తేవాలన్నారు. రైతు కుటుంబాలకు రూ.15లక్షల రూపాయలు, గాయపడ్డ వారికి ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నష్టపోయిన ఆహారపంటల రైతులకు ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.75వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంటల బీమా నిధులు విడుదల చేయాలన్నారు. రైతులు, కౌలు రైతుల సాగు సాయం ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలన్నారు. నేషనల్ డ్యామ్‌సేఫ్టీ కమిటీ నిర్ధారణ మేరకు శ్రీశైలం ప్రాజెక్టు దిగువభాగంలో పడిన గుంతను పూడ్చి డ్యామ్ రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారెడ్డి, పోలిరెడ్డి భాస్కర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా, బీకే ఎంయూసీ సుబ్రమణ్యం, మహిళా సమాఖ్య ఎన్.విజయలక్ష్మి, సావంత్ సుధాకర్, మునెయ్య, మద్దిలేటి, దస్తగిరి, మల్లిఖార్జున, లింగన్న, ఈశ్వరయ్య, భాగ్యలక్ష్మి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కట్టా యానాదయ్య, చిలువుగారి పుల్లయ్య, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి


డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం రూరల్, జూన్ 27: ఏపీలో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ కమలాపురం నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాన్ని తందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు 20వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలన్నారు. పెరిగిన ఉత్పత్తుల ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు వడ్డీలేకుండా 3 లక్షల వరకు పావలా వడ్డీతో ఐదు లక్షల వరకు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గత రబీ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించాల న్నారు. స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు షేక్షావలి, మిద్దె రమణ, సుబ్బరాయుడు, రాయప్ప పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ ప్రభుత్వ తోడ్పాటు : ఎమ్మెల్యే మాధవి


పాఠ్య పుస్తకాలు, బ్యాగులు అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27 : పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవి అన్నారు. గురువారం కడప నగరం ప్రకాశ్‌నగర్ చంద్రమౌళి హైస్కూలులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తాను గెలవడంతో ఎన్నికల సమయంలో తాను చెప్పిన విధంగా నగరాభివృద్ధి మహిళల రక్షణ విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాబోవు కాలంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రతి పాఠశాలను తనిఖీ చేసి అక్కడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలబడుతుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించి వారి బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ఉదయ్, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ గుడ్డు, బాలామృతం తప్పనిసరి

● కమిషనర్ ప్రవీణ్‌చంద్


అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల గురించి అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27 : అంగన్వాడీలో పిల్లలకు ప్రతిరోజూ గుడ్డు, బాలామృతం తప్పనిసరి అని కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. గురువారం కడప నగరం నిరంజన్‌కాలనీ, ఫరీదానగర్, శివానందపురంకాలనీలో గల అంగన్వాడీ కేంద్రాలను ఎస్టీవీకాలనీ యుపీహెచ్‌సీలను పరిశీలించారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలకందిస్తున్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలకు మంచి విద్యాబోధన అందించాలని పేర్లను రంగులు గురించి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అలాగే యుపీహెచ్‌సీ పరిశీలించి ఓపీలో ఉన్న వివరాల ప్రకారం పేషంట్లకు స్వయంగా ఫోను చేసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

'గ్రూప్ మెయిన్స్ పరీక్షకు మరికొంత సమయం ఇవ్వాలి'

కడప (నాగరాజుపేట), జూన్ 27 : గ్రూప్ మెయిన్స్ పరీక్షకు మరికొంత సమయం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండులోని జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారని, అయితే ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిలబస్ ఎక్కువగా ఉం దని, దీంతో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుంచి కాకుండా మరో రెండు నెలల పాటు వాయిదా వేయాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహులు తది తరులు పాల్గొన్నారు.

వైవీయూ వీసీ, రిజిస్ట్రారుపై చర్యలు తీసుకోవాలి

● టీఎన్ఎస్ఎఫ్ ఆందోళన



వైవీయూ ఎదుట నిరసనలు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27 : వైవీయూలో విద్యను అథోగతిపాలు చేస్తూ కనీవినీ ఎరుగని రీతిలో అక్రమాలకు పాల్పడిన వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లను అలాగే వారికి ముందుండి నడిపిస్తున్న ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్ వీసీ సురేంద్రనాథరెడ్డిలపై సీఐడి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్ చేశారు. గురువారం వైవీయూలో జరిగిన అక్రమ నియామకాలు, ఆర్థిక అవకతవకలు, విద్యా ప్రమాణాలు దిగజార్చడం, అవినీతి వంటి విషయాలపై వివరణ ఇవ్వాలని గురువారం టీఎన్ఎస్ఎఫ్ బృందం వైవీయూలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్ 150 మందిని ఔట్‌సోర్సింగ్‌కు సంబంధించి ఎటువంటి రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ పాటించకుండా ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారన్నారు. మాజీ డిప్యూటీ సీఎం సిఫారసుతో డీన్‌ను కాలేజీ డెవలప్‌మెంటు కౌన్సిల్‌ను నియమించారన్నారు. రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్నప్పుడు యూనివర్సిటీ సిబ్బందికి ఫోను చేసి వైసీపీని గెలిపించాలని ప్రచారం చేసినట్లు ఆరోపించారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్, సమీర్, సిద్దార్థ, ఫరీద్, శ్రీను, చెన్నకేశవ, రవి పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో అవినీతిపై ప్రభుత్వం స్పందించాలి

గత ఐదేళ్లుగా వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల్లో అవినీతిపై ప్రభుత్వం స్పందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. గురువారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో ముగ్గురు వీసీలు, రిజిస్ట్రార్లు పనిచేశారని, వీరిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేసి ఎలాంటి రిజర్వేషన్లు పాటించకుండా అప్పటి ఎంపీ, వీసీని కలిసి బంధువులు, అనుచరులకు, డబ్బు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చి రూ.కోట్లు దోచుకున్నారన్నారు.

'వైవీయు వీసీ, రిజిస్ట్రార్లపై సీఐడీ విచారణ జరిపించాలి'

కడప (నాగరాజుపేట), జూన్ 27 : మాజీ సీఎం జగన్ బామ్మర్ది ఈసీ సురేంద్రనాథరెడ్డి అండతో అవినీతిలో పేట్రేగిపోయిన వైవీయూ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యలపై సీఐడీ విచారణ జరిపించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం జరిగిన బీఈడీ అడ్మిషన్స్‌లో ఆయా కాలేజీలకు ఎలాంటి భవనాలు, అధ్యాపకులు, లైబ్రరీలు లేకున్నా అడ్మిషన్స్ జరుపుకునేందుకు ఒక్కో కాలేజీ నుంచి రెండు నుంచి మూడు లక్షల రూపాయలు వారు దోచుకున్నారని ఆరోపించారు.

మౌలిక వసతులు కల్పించమంటే బెదిరింపులు తగదు

● బుద్ధ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

కడప (మారుతీనగర్), జూన్ 27: కడప నగర శివారు ప్రాంతం బుద్ధ టౌన్‌షిప్‌లో నివాసం ఉన్న వారికి సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా అడిగిన నేరానికి పోలీసులతో బెదిరింపులకు పాల్పడడం సరికాదని బుద్ధ టౌన్‌షిన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బుద్ధ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయి మిత్ర డెవలపర్స్ ఆధ్వర్యంలో ఇది వరకు ఈ ప్రాం తంలో లేఅవుట్ వేసినట్లు తెలిపారు. తాము గత 2018లో ఈ ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకున్నట్లు తెలిపారు. స్థలాలు కొనుగోలు చేసే సమయంలో తమ కు పలు హామీలను ఇచ్చారన్నారు. కడప నగరానికి దూరంగా ఉండటంతో స్థానికంగా స్విమ్మింగ్‌పూల్, క్లబ్ హౌస్ తదితర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారన్నారు. డాక్యుమెంటులో పొందుపరిచిన కండీషన్స్ మేరకు వివిధ సౌకర్యాలు కల్పించాలని కోరగా పోలీసులతో బెదిరించి కేసులు నమోదు చేయించడం బాధకరమన్నారు. ఈ విషయపై ఉన్నతాధికారుల పలుమార్లు విన్నవించినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి బయపురెడ్డి, బీరం శశిధర్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

సీకేదిన్నె, జూన్ 27: రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధిని మెరుగుపరచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ తెలిపారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా వానపాముల ఎరువుల తయారీపై 40 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన రైతులు ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని, విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం వలన భూసారం దెబ్బతింటుందని వానపాముల ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, సురేష్, మానస పాల్గొన్నారు.

ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

వేంపల్లె, జూన్ 27: ఏఐటీయూసీ అనుబంధం వేంపల్లెలోని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక జీటీ ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణ కార్మిక సం ఘం నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రా మాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కుంచపు లింగన్న ఆ ధ్వర్యంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అధ్యక్షుడిగా షేక్ దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా చల్లా బాలాజి, ఇతర విభాగాలకు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రానికి మూడు పురస్కారాలు


కృషి విజ్ఞాన కేంద్రం తరఫున అవార్డు అందుకుంటున్న వీరయ్య

సీకేదిన్నె, జూన్ 27: కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు మూడు పురస్కారాలు లభించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త వీరయ్య తెలిపారు. జోనల్‌స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు గ్రామీణ యువతను వ్యవసాయ, వ్యవసా య ఆధారిత రంగాలవైపు ఆకర్షించుటకు నిలుపుకొనుట (ఆర్య) పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు ఒక పురస్కారం లభించిందన్నారు. అదే విధంగా మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను జిల్లాలో విస్తరించినందుకు రెండవ పురస్కారం, స్పాన్సర్డ్ శిక్షణ కార్యక్రమాలను ఎక్కువగా జరిపి యువతకు శిక్షణ ఇచ్చినందుకు మూడవ పురస్కారం లభించినట్లు తెలిపారు. ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అనుప్రయోగ సంస్థ జోన్- 10 డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్. మీరా, ఆచార్య ఎన్జీరంగ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ప్రమీలా రాణి, భారతీయ నూనెగింజల పరిశోధన డైరెక్టర్ ఆర్కె. మాతూర్ సమక్షంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వీరయ్యకు అందించామన్నారు.

తాగునీరు, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


తొండూరు బీసీ హాస్టల్‌లోని వంట గదిని పరిశీలిస్తున్న డాక్టర్ రేష్మ

పులివెందుల రూరల్, జూన్ 27: విద్యార్థులకు అందించే తాగునీరు, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని తొండూరు మండల వైద్యాధికారిణి రేష్మ సూచించారు. గురువారం మండల కేంద్రమైన తొండూరులోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు, వంటరూములను, విద్యార్థుల గదులను పరిశీలించారు. ప్రస్తుతం అతిసార వ్యాధి ప్రబలుతోందని అక్కడి సిబ్బందికి తెలిపారు. మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె ఫైర్ ఆఫీసర్‌గా వెంకటసుబ్బయ్య



వేంపల్లె, జూన్ 27: వేంపల్లె ఫైర్ ఆఫీసర్‌గా కె.వెంకటసుబ్బయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. బ ద్వేలులో సీనియర్ లీడర్ అధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వేంపల్లెకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్‌గా పనిచేస్తు న్న శివకుమార్ స్థానంలో బాధ్యత లు స్వీకరించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలను చైతన్యవంతులను చేయడం, ప్రమాదాలు జరిగినపుడు అగ్నికీలలను ఆర్పివేయడమే లక్ష్యంగా పనిచేస్తామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారి తెలిపారు.

జూలై 4 నుంచి 'సంపూర్ణత అభియాన్' అమలు

కడప(కలెక్టరేట్), జూన్ 27: సంపూర్ణత అబియాన్ కార్యక్రమం జూలై 4 నుంచి సెప్టెంబరు వరకు అమలు చేయనున్నట్లు కలెక్టర్ విజయ రామరాజు పేర్కొన్నారు. ఈ మేరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం జిల్లా కలెక్టర్లతో సంపూర్ణత అభియాన్‌పై వీడియో కాన్ఫ రెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ అకాక్షింతబ్లాక్ ప్రోగ్రామ్ కార్యక్రమం కింద ఎంపికైన జిల్లాలు సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలుకు పక్కా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో స్థానికులకు దక్కని సీట్లు

చక్రాయపేట, జూన్ 27: మండల కేంద్రమైన చక్రాయపేటలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో స్థానిక విద్యార్థులకు సీట్లు దక్కడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చక్రాయపేట మండలం కరువుకాటకాలకు నిలయమని, చాలా మంది చదువురాని వారు ఉన్నారని ఎక్కువ మంది డ్రాపౌట్స్ ఉన్నారని, అప్పట్లో మహిళలకు కస్తూర్బా పాఠశాలను మంజూరు చేశారు. ఆ పాఠశాలలో తొలిప్రాధాన్యత స్థానికులకే ఇవ్వాలి. ప్రతి గ్రామంలో తిరిగి డ్రాపౌట్లను గుర్తించి పాఠశాలలో చేర్పించాలి. అప్పట్లో విద్యార్థులు లేక ఇబ్బందులుపడేవారు. కస్తూర్బా పాఠశాలలో ఏడాదికేడాది ఉత్తీర్ణత శాతం పెరగడం, నాణ్యమైన విద్య అందించడం, మంచి వాతావరణం ఉండడం, ఇంటర్ వరకు అవకాశం ఉండడంతో పాఠశాలలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఒక ఉపాధ్యాయుడు గంగవరపు శివారెడ్డి ఒక డ్రాపౌట్ విద్యార్థిని తీసుకెళ్లి సీటు ఇవ్వాలని కోరారు. స్థానికులకు సీటు లేదని చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకు కాకుండా సుదీర్ఘప్రాంతాల నుంచి వారికే ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

భవిత చిన్నారులకు దుప్పట్లు పంపిణీ

వేంపల్లె,జూన్ 27: వేంపల్లెలోని భవిత కేంద్రంలో ఉన్న విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం ది కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమి తి వారు దుప్పట్లు సమకూర్చి సెక్రటరీ నజీమ్ అహమ్మద్‌చే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

అవకాశాలు సృష్టించండి - ఉపాధి కల్పించండి

పులివెందుల రూరల్,జూన్ 27: కళాశాలలో ఉన్న వనరులను వినియోగించుకొని అవకాశాలు సృష్టించి ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలని అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎమణి ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర - సాంకేతిక కళాశాలలో కాలేజ్ అండ్ హాస్టల్ డే నిర్వహించారు. డాక్టర్ మణి మాట్లాడుతూ ఆహార ప్రాసెసింగ్ సెక్టార్‌లో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకు పలు అంశాలను వివరిస్తూ ప్రసంగించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి సన్మానం


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న అమానుల్లా

కడప (నాగరాజుపేట), జూన్ 27 : నగరంలోని 27వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అమానుల్లా గురువారం కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ కార్యాలయంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఎంతో సంతోసంగా ఉన్నారన్నారు. జూలై 1న అవ్వతాతలకు రూ.7వేలు ఇస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అభివుల్లా, షబీబుల్లా, పఠాన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతిలో అన్నిరకాల రోగాలకు చికిత్స

కమలాపురం రూరల్, జూన్ 27 : హోమియోపతి మందులు వాడడం వల్ల ఎలాంటి సమస్యలు రావని అన్ని రకాల జబ్బులకు హోమియోపతిలో వైద్యసేవలు ఉన్నాయని హోమియోపతి వైద్యుడు డాక్టర్ షాకీర్‌హుసేన్ తెలిపారు. కమలాపురం పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల విద్యార్థులకు హోమియోపతి మందులను పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ శ్రీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు రాఘవ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ


వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27 : జిల్లావ్యాప్తంగా అనుమతి లేకుండా కొనసాగుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, మనోజ్ డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు అమ్ముతూ అక్రమంగా వేల రూపాయలు వసూలు చేస్తున్నారని టెస్టు బుక్కులు, యూనిఫాం వంటి పేర్లతో ఇష్టమొచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. అలాంటి విద్యా సంస్థలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభినయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27 : విద్య ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణ, ఖాళీగా ఉన్న అన్ని రకాల క్యాడరు పోస్టుల భర్తీ, జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్ల పదోన్నతులు నెలవారీ ప్రమోషన్లు చేపట్టడం గాడి తప్పిన విద్యావ్యవస్థను సరిచేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెయుపి అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం, వెంకటసుబ్బయ్య, వీరయ్య, క్రిష్ణరెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు అదనపు సమయం ఇవ్వాలి

జమ్మలమడుగు, జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత సమయం ఇవ్వాలని కోరుతున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్‌యాదవ్ కోరారు. ఏపీ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించినట్లు ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్‌లో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. విస్తృతి ఎక్కువగా ఈ రెండు కారణాల దృష్ట్యా పరీక్షను మరో రెండు నెలలు వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా మొబైల్ పేకాట ?

జమ్మలమడుగు, జూన్ 27: జమ్మలమడుగులో ఇటీవల మొబైల్ పేకాట జోరందుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని మోరగుడి, మూడు రోడ్ల కూడలి, బైపాస్ రోడ్డులో, మిల్లుల వద్ద, ప్రొద్దుటూరు రోడ్డులోని కన్నెలూరు మోటు, పాత బస్టాండులోని లాడ్జీల్లో గండికోటలోని రిసార్ట్ భవనాలు పేకాట స్థావరాలుగా మారాయి. రైల్వేస్టేషన్ శివార్లలో తదితర చోట్ల పేకాట జరుగుతోందని పలువురు ప్రజలు వాపోతున్నారు. అందులో ఇటీవల పోలీసు అధికారులు పేకాట స్థావరాల విషయం తెలిసినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొబైల్ పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇకపై ఓహెచ్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్‌లు క్లీనింగ్

డయేరియాను అరికట్టేందుకు క్లోరినేషన్


క్లీనింగ్‌ను పరిశీలిస్తున్న ఏఈ, ఉపసర్పంచి

ఎర్రగుంట్ల, జూన్ 27: ప్రభుత్వ ఆదేశాలమేరకు ఇకపై ప్రతి 15రోజులకోమారు నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయశేఖర్ పేర్కొన్నారు. గురువారం పోట్లదుర్తిలోని 1.5లక్షల సామర్థ్యం గల ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. మండలంలోని అన్ని జీఎస్‌ఎల్‌ఆర్, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌లను పూర్తిగా శుభ్రం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు క్రమం తప్పకుండా సరఫరా చేస్తామని ఏఈ వివరించారు. కార్యక్రమంలో పోట్లదుర్తి ఉపసర్పంచి రామునాయుడు, సచివాలయ సిబ్బంది, టి.సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

బద్వేలుటౌన్, జూన్ 27: వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్, ఏపీజీఎల్ఐ సరెండర్లకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మానుకుంట రవిశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇవ్వబోయే తల్లికి వందనం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే పరిమితం చేయాలన్నారు. విద్యాశాఖామంత్రి నారాలోకేష్ పాఠశాల విద్యలో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించడం, ఉపాధ్యాయులపై ఉన్న అనవసరపు యాప్‌ల భారాన్ని తగ్గించి పూర్తిస్థాయిలో బోధనపై దృష్టిసారించేలా చర్యలు చేపట్టడం, నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించడం శుభపరిణామమన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జీఓ నెంబర్ 117ను రద్దుచేసి ఉన్నత పాఠశాలలో విలీనమైన 3, 4 5తరగతులను వెంటనే తిరిగిపంపేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

సినిమా టిక్కెట్ల ధరలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 27: థియేటర్లలో అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్న థియేటర్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొత్త సినిమా రిలీజ్ కాగానే మొదటిరోజు ఒక్కో టిక్కెట్‌ను రూ.500 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. థియేటర్లలో ప్రేక్షకులకు తాగడానికి మంచినీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు లేవని, అధిక ధరలకు తినుబండారాలు, శీతలపానీయాలు విక్రయిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల పార్కింగ్‌కు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి వసతులు లేకపోయినా యాజమన్యాలు కొత్త సినిమా విడుదల కాగానే అధిక ధరలకు టిక్కెట్లు విక్రయించి ప్రేక్షకులను దోచుకుంటున్నారని, ఈ దోపీడీపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ప్రదీప్, ఓబులేసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉద్యమానికి శ్రీకారం చుడతాం


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 27: ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన ఉద్యమం ప్రారంభమై 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నూతన ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం చేపట్టిన ఉద్యమం 30 ఏళ్లు పూర్తయిందని దీంతో జూలై 7వ తేదీ ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ జనజాతర బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రారంభించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజంలోని అన్ని పీడిత వర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. 1999 నుంచి 2004 వరకు వర్గీకరణ జరిగి మాదిగలు ఎంతగానో లబ్ధిపొందారని తెలిపారు. వర్గీకరణపై కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో కోర్టు వర్గీకరణను రద్దు చేసిందన్నారు. దీంతో 2004 నుంచి 2024 వరకు రెండు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతోందన్నారు. సుదీర్ఘ ఉద్యమ కాలంలో మాదిగలు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎస్.రాజా, నేతలు నరసింహులు, ఎల్లయ్య, పుల్లయ్య, శ్రీనివాస్, చెన్నమ్మ, పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న సిబ్బంది

కలసపాడు, జూన్ 27: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం కలసపాడు మండలం పెండ్లిమర్రి కేజీబీవీని సందర్శించిన ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కేజీబీవీ సిబ్బంది సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బీఎస్‌వీ ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.శివారెడ్డి, జిల్లా కౌన్సిలర్ విజయభాస్కర్‌రెడ్డి, మహిళా కార్యదర్శి బేబి సరోజా, స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి, సీఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'ను కలిసిన ఆర్యవైశ్య సభ ప్రతినిధులు


పుట్టాను సత్కరిస్తున్న ఆర్యవైశ్యసభ ప్రతినిధులు

మైదుకూరు, జూన్ 27: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో ఆర్యవైశ్య సభ ప్రతినిధులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పుట్టాను కలసిన వారిలో సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్ గుప్త, కమిటీ ప్రతినిధులు దరిశా వరహాలు గారి సునీల్, ఏలిశెట్టి ప్రసాద్, గూండా ఆనంద్, పబ్బతి వేణు, అయ్యపుశెట్టి సురేంద్ర, నాగేశ్వ శేషుబాబు, శీకాకొల్లు గోపాల్ తదితరులున్నారు.

జనసేన నేతలు...

జనసేన మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పండిటి మల్హోత్ర గురువారం హైదారాబాదులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి అభినందించారు. అనంతరం పూలమాలతో సత్కరించారు.

నేడు 'పుట్టా' విజయోత్సవ ర్యాలీ

మైదుకూరు, జూన్ 27: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి శుక్రవారం మైదుకూరుకు విచ్చేస్తున్న సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఘనస్వాగతం పలికేందుకు అభిమానులు, నేతలు విజయోత్సవ ర్యాలీ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ సరిహద్దు అయిన దువ్వూరు మండలం చాగలమర్రి ప్రాంతం నుంచి చాపాడు మండలం నాగలపల్లె వరకు ఆయనకు భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు పెద్దఎత్తును పాల్గొనాలని ప్రకటించారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో అధికారులు

మైదుకూరు, జూన్ 27: పాఠశాలలో విద్యార్థుల పట్ల వ్యక్తిగత శుభ్రతపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసరు మిట్టా కేశవరెడ్డి కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం మైదుకూరు, ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన దాదాపు 75 పాఠశాలల ఉపాధ్యాయులకు 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై దృష్టి సారించాలని, మరుగుదొడ్లను ఆయాల చేత శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేతులు శుభ్రపరిచే విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. జిల్లా ప్రోగాం ఆఫీసర్ విష్ణువర్ధన్, మండల విద్యాధికారులు పద్మలత, నరహరిశర్మ పాల్గొన్నారు.

చిలమకూరులో బీజేపీ ఆధ్వర్యంలో మినరల్‌వాటర్


సిద్ధమైన మినరల్‌వాటర్ ప్లాంటు

ఎర్రగుంట్ల, జూన్ 27: చిలమకూరు హైస్కూల్ ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంటును బీజేపీ స్వాధీనం చేసుకుంది. ఇక్కడి నుంచే ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తామని, ఇప్పటి నుంచి ఇది దేవగుడి సుబ్బరామిరెడ్డి, శంకర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తుందని ఎంపీటీసీ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ మినరల్ వాటర్ ప్లాంటుకు సంబంధించి ఇప్పటికి రూ.4.40లక్షల విద్యుత్ బకాయిలున్నట్లు తెలిపారు. ఈ బకాయిలను త్వరలో అధికారులు చొరవ చూపి కట్టించనున్నట్లు పేర్కొన్నారు. ఇకపై తాము ఏ నెలకు ఆనెల విద్యుత్ బిల్లులు చెల్లిస్తామన్నారు.


ముక్తియార్‌ను సన్మానిస్తున్న దృశ్యం


రక్తదానం చేస్తున్న దృశ్యం

ముక్తియార్‌కు సముచిత 'స్థానం కల్పించాలి

ఘనంగా ముక్తియార్ పుట్టిన రోజు వేడుకలు

ప్రొద్దుటూరు ,జూన్ 27: టీడీపీ మైనారిటీ నేతగా ముక్తియార్ పార్టీకి ఎన్నో సేవలందించారని ఆయనకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని మన ప్రజా సేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ కోరారు.

గురువారం స్థానిక ఇస్లాంపురం వీధిలోని తన స్వగృహంలో ముక్తి యార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముక్తియార్‌ను టీడీపీ కార్యకర్తలు మైనారిటీ నేతలు పెద్దఎత్తున సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా, సహాయ కార్యదర్శి మహేష్, రాజేంద్ర, గౌస్, సభ్యులు యూసుఫ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాలు కొనసాగించాలి


ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మీ సేవ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు, జూన్ 27: మీ సేవ కేంద్రాలను గతంలో లాగే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీసేవా కాంట్రాక్టు ఉద్యోగులు వేడుకున్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం మీసేవలను నిర్వీర్యం చేస్తూ జీఓ తెచ్చిందన్నారు. తద్వారా మీసేవాకేంద్రాలు మూతపడి కాంట్రాక్టు ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం మీసేవా కేంద్రాలను కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు

402 మంది విద్యార్థులకు మందుల పంపిణీ


విద్యార్థులకు మందులు వేస్తున్న డాక్టర్ మునిరామ ప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 27: స్థానిక అమృతానగర్‌లో 402 మంది విద్యార్థులకు కల్లూరు మెడికల్ ఆఫీసర్ మునిరామ ప్రసాద్ హోమియో మందులు పంపిణీ చేశారు. అమృతానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు రామ్‌ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులకు డాక్టర్ మునిరామప్రసాద్ మందులను అందించారు. కార్యక్రమానికి విద్యార్థులు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

61 రోజులు చేపలవేట నిషేధం

కొండాపురం, జూన్ 27: జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 61 రోజులు గండికోట ప్రాజెక్టులో చేపలవేటను నిషేధించనున్నట్లు ఫిషరిస్ డీడీ శాంతి తెలిపారు. ఈ సమయంలో చేపలు గుడ్లు పెట్టే దశలో ఉన్నందున చేపలవేటను నిషేధిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ విషయాన్ని మత్స్యకారులు గమనించి చేపలవేటకు వెళ్లవద్దని ఆమె సూచించారు.

'ప్రైవేటు విద్యాసంస్థల్లో తేడాలపై చర్యలు తీసుకోండి'

జమ్మలమడుగు, జూన్ 27: జిల్లా అధికారులు విచారించి ప్రైవేటు విద్యాసంస్థల్లో జరిగే తేడాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ బాధ్యులు వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగులో ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ అధిక ఫీజుల వసూళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అడ్మిషన్ పేరుతో వేలకు వేలు డబ్బు గుంజుతున్నారని, పాఠశాలల్లోనే పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. ఫీజుల వారీ సెక్షన్లను విడదీస్తూ, అధిక ఫీజులు కట్టినవారిపైన ప్రత్యేక దృష్టిసారిస్తున్నారనే తేడాలను గమనించాలన్నారు. వాహనాల ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు అంటూ విద్యను వ్యాపారం చేసి డబ్బు దండుకుంటున్నారన్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో వైద్య శిబిరం


హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు, జూన్ 27: రాష్ట్రంలో డయేరియా వ్యాధి ప్రబలుతుండడంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వున్న విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గురువారం పొట్టి పాడురోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వుండే కాలేజీ విద్యార్థులకు కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. హాస్టల్స్‌ల్లో గదులు మరుగుదొడ్లు శుభ్రంగా వుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హనీఫ్ బాబా, హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి


కూనవారిపల్లెలో సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట, జూన్ 27: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ సచివాలయ సిబ్బందికి ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం చెముళ్లపల్లె, కూనవారిపల్లె పంచాయతీ కార్యాలయాల్లో గ్రామాలను పరిశీలించిన వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్‌వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా పట్లకూడా అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో వసతులు మెరుగుపరచాలి : బీసీ నేతలు


హాస్టల్ వంటగదిని పరిశీలిస్తున్న బీసీ నేతలు

ప్రొద్దుటూరు, జూన్ 27: పేద పిల్లలు తలదాచుకునే బీసీ ఎస్సీ హాస్టళ్లలో వసతులు ఘోరంగా వున్నాయని ఆఖరికి వంట బిల్లులు కూడా ఆరునెలలుగా ప్రభుత్వం ఇవ్వడం లేదని బీసీ సంక్షేమ సంఘం నేతలు క్రిష్ణయ్య మాదాసు మురళి ఆరోపించారు. గురువారం నడింపల్లెలోని ఎస్సీ హాస్టల్, రాజేశ్వరీ కాలనీలోని బీసీ హాస్టల్‌ను బీసీ సంక్షేమ సంఘం నేతలు పరిశీలించారు. మరుగుదొడ్లు సరిగాలేవని నీళ్ళు కూడా సరిగా రావడంలేదని ఆరోపించారు. ఆమేరకు హాస్టల్ అధికారులతో చర్చించారు. హాస్టల్ సమస్యలపై జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నేతలు మాడి శెట్టి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలని వినతి

జమ్మలమడుగు, జూన్ 27: జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ సహా సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని గురువారం డీఎస్పీ కార్యాలయం ఆవరణలో గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీ వాసులు షబ్బీర్, షేక్ మున్నీ విజ్ఞప్తి చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీలో రూమ్‌నెం.838లో తమ కూతురు భాను, అల్లుడు రఫి నివాసం ఉన్నట్లు తెలిపారు. 2021 ఏప్రిల్ 25న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి చోరీ చేశారని తెలిపారు. ఆ రోజు 9 తులాల బంగారం, వస్తువులు చోరీ చేశారని అప్పట్లో అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అప్పటి నుంచి పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు. తర్వాత తాము ఫిర్యాదు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. దీంతో తమ కూతురి కుటుంబం ఇబ్బందులకు గురైందన్నారు. గతంలో పనిచేసిన డీఎస్పీ ఈ కేసులో రూరల్ సీఐ కార్యాలయానికి అప్పట్లో పంపించారన్నారు. అర్బన్ స్టేషన్‌లో, రూరల్ స్టేషన్‌లో కానీ పనిచేసిన అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.